## చిన్నకథ

# 'ఇల్లిస్తాను... కాని..'

-భమిడిపాటి గౌరీ శంకర్

'కృష్ణుడు ఏమన్నాడో తెలుసా..' ఇంటి యజమాని ప్రశ్న.

'ఏ కృష్ణుడు.. వినాయకుడు సినిమాలో కృష్ణుడా.' నా జవాబు కమ్ ప్రశ్న..

'మీ వాడు టూమచ్‌గా.. ఇంటి ఓనర్‌తోనే జోకుతున్నాడు...' నా ఫ్రెండ్‌తో ఇ.య. సమాధానంతో కూడిన గాండ్రింపుతో మిక్స్ చేసిన అదిలింపు.

'సారీ నండీ. వాడికి లోకజ్ఞానం.. ఇంగిత జ్ఞానం రెండూ కూడా లేవూ. చిన్న తనంలోనే వాడి జ్ఞాన దంతం నువ్వు జీళ్లు తినడంవలన ఊడి పోయింది. పెద్దవారు... చిన్నవాడిని క్షమించేయండి. ఇంతకీ ఏ కృష్ణుడో చెప్పలేదు.' నా ఫ్రెండ్.. అభ్యర్థన.

యాజమాని ముఖంలో శాంతరసం.. చిద్విలాసంగా నవ్వి.. (వీడి కర్ర చెక్క ముఖానికి నవ్వయినా... ఏడుపైనా ఒకలాగే ఉంటుంది.. వెధవ బోడి జోకులు, వీడూను. నా మనసులోని ఫీలింగ్. బయటకు రానీయకుండా తొక్కిపెట్టాను) 'భగవద్గీతలో శ్రీకృష్ణుడు... నయనంచిన్దన్తిశస్త్రాని... అంటే కర్మలు చేయడం వరకే మన విధి... లేకుంటే ఎవడి ఖర్మకు వాడేడవలసిందేనని చెప్పాడు కదండి...'

(ఆ శ్లోకానికి ఆ భావం కాదురా దరిద్రుడా... ఎంత ఇంటి యజమానివైనా... నీవు చెప్పిన ప్రతీ అడ్డమైన మాటకు గంగిరెద్దులా తలూపడం మాకు చేతకాదురా చవటా... మనసులోని మాటను బయటకు రానీయకుండా..) 'దానర్థం అదికాదేమో సార్...' అన్నాను మెల్లగా..

'మీ వాడికి అసలేం తెలుసు... అన్నీ మూసుకొని.. నేను చెప్పిన దానికల్లా తలూపి.. ఇంట్లో అద్దెకు దిగాలి తెలుసా.. దిగిన తరువాత కూడా నేనేది చెబితే అదివినాలి.. చెప్పు... మీ వాడికి..' నా ఫ్రెండ్‌తో ఇ.య..

'అలాగే కానీయండి సార్... మీ వంటి జ్ఞానవంతుల ఇంట్లో దిగితే వాడికి కూడా ఇంత జ్ఞానం వంటపడుతుంది..' నా ఫ్రెండ్.. ఓవరాక్షన్.

'జ్ఞానం వంటపట్టడం కాదేమో.. వాక్యం సరిగా లేదేమో.' నా ఫ్రెండ్ చెవిని మెల్లగా కొరికాను. రక్తం కారుతున్న చెవిని ఓ చేత్తో పట్టుకొని. 'కాస్త అన్ని మూసుకొని కూర్చుంటావా..!' అన్నట్లుగా కోపంగా.. బాధగా.. చూసాడు.. నేను అన్ని మూసుకొన్నాను.

'ఇలా చెవులు.. చేతులు కొరికే దరిద్రపు అలవాటు ఉన్నవారికి నేనిల్లు ఇవ్వను..' ఇ.య. కేకలు..

'సార్.. సార్.. అద్దె ఎంతయినా ఫర్వాలేదు.. ఎన్ని షరతులు విధించినా ఫర్వాలేదు.. గత పాతిక రోజులుగా.. కాళ్లకు బలపాలు కట్టుకొని తిరుగుతున్నాం. లంకంత కొంప కూడా వెయ్యి రూపాయల అద్దెకే ఇస్తామంటున్నారు.. కాని.. వారు పెట్టే ఒకే ఒక షరతుకు తట్టుకోలేక... ఇల్లు దొరక్క ఛస్తున్నాం.. ప్లీజ్.. దయచేసి కాదనకండి.. బ్రహ్మచారులమని భయం వద్దుసార్.. మీరెలా చెబితే.. అలా... తూ.చ. తప్పకుండా ఆచరిస్తాం.. మహాప్రభో మీరే శరణు...' నా ఫ్రెండ్.. సరాసరి.. ఇ.య. కాళ్ళమీద పడ్డాడు.

'మీరు బ్రహ్మచారులా.. నిజమే...!?' ఆశ్చర్యం... ప్రశ్నార్థకం కలగలిపిన ఫీలింగ్‌తో కూడిన ప్రశ్న...

మాకెందుకో... గుండె గుభేలుమంది... అనవసరంగా నోరు జారామా అనిపించింది...

'అంటే.. మా ఉద్దేశ్యం... బ్రహ్మచర్యం అంటే..' ఇంకేం చెప్పాలో నాకు తెలియలేదు..

'అదికాదయ్యా.... ఇంటికోసం.. అబద్ధం చెప్పి. ఆ తరువాత భార్యలను తెస్తే కష్టం కదా..' అని నా భావం.. ఇ.య. వివరణ.

హమ్మయ్య.. మా చిలక్కొట్టుడు వ్యవహారాలు ఈ ముసలాడికి తెలిసిపోయిందేమోనని భయపడ్డాం.. సర్దుకొని... 'అబ్బేబ్బే అటువంటిదేమి లేదు సార్. నిజంగానే మాకు పెళ్లికాలేదు.. మీకు అమ్మాయిలు ఎవరూ లేరుకదా సార్..' ఒక ప్రక్క ఆశ.. రెండోవైపు అనుమానం.

'నా వయసు ఎంత ఉంటుందనుకుంటున్నారు..' సడన్‌గా ఓ పజిల్ విసిరాడు ఇ.య.

నా ఫ్రెండ్ తెలివిగా.. 'మహా ఉంటే నలభై... నలభై అయిదు మధ్య ఉండవచ్చుసార్..'

ఇ.య. గట్టిగా నవ్వి.. 'నా వయసు అరవై..



అయినా యంగ్‌గా ఉన్నానంటే కారణం.. యోగా చేయటమే..' అని చెబుతున్నప్పుడు ఆయన ఛాతి ఆరుగజాలు సాగటం మాకానందమనిపించింది...

'ఇహ... అసలువిషయానికి ఒస్తానోయ్... ఇలా వీధిలో మిమ్మల్ని నిల్చోపెట్టి మాట్లాడటం భావ్యం కాదుకదా.. నాకో మనవరాలు ఉంది. వాళ్లనాన్న మిలటరీ ఆఫీసర్. నా మనవరాలికి కరాటేలో బ్లాక్ బెల్ట్ ఉంది. దాని వెనకాలే ఒక ఆల్సేషన్ కుక్క ఉంటుంది. దాని మెడలో కూడా మాంచి లెదర్ బెల్ట్ ఉంది. కుక్క కరిస్తే. మరిహ తిరుగులేదు. దానికి నరమాంసమంటే భలే ఇష్టం. అది సర్వసాధారణంగా పగలు తిరగదు. తిరిగిందా. మీ వంటి పిక్క బలం గల వారిని చూస్తే వదలదు. కనుక. నా మనవరాలి గురించి నాకు బెంగలేదు. ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్. నా మనవరాలికి పెళ్లయిపోయింది. ఆమె భర్త మనూరి సి.ఐ.గా పనిచేస్తున్నాడు. ఇంటిని చూసారు కదా. లంకంత కొంప. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అద్దె ఎనిమిది వందలు ఇస్తే సరిపోతుంది.' దబ్ మన్న శబ్దం విని ముసలాడు చెబుతున్నది ఆపేసి, భయంగా శబ్దం వచ్చిన దిక్కుగా చూసాడు.

నా ఫ్రెండ్. అదేదో సినిమాలో బ్రహ్మానందం లాగా.. కాళ్లు చేతులు కొట్టుకొంటూ.. ఏడుస్తున్నాడు.

ముసలాడు నా వైపు భీకరంగా చూసి. 'మూర్ఛ రోగులకు నేను ఇల్లు అద్దెకివ్వను. వెళ్లండి. ముందు వాడి చేతిలో ఈ తాళం చెవులు పెట్టు.' అని టీపాయ్ మీద ఉన్న బీరువా తాళాలను నాకిచ్చాడు. వెంటనే నా ఫ్రెండ్ ఇంటి యజమాని (ఇ.య) కాళ్ల మీదపడి పోయాడు. 'సార్.. మీ వంటి దాతలు ఇంకా భూమ్మీద ఉండబట్టే మా వంటి వారు ఆనందంగా బ్రతకగల్గుతున్నాం. వానలు అప్పుడప్పుడైనా కురుస్తున్నాయి. రైళ్లు సకాలంలో నడుస్తున్నాయి.' అన్నాడు ఆనందంగా.

ముసలాయన. వాడిని లేవనెత్తి. 'ఆనందంలో పడిచచ్చావా. నేనేమో నీకు మూర్ఛ రోగం ఉందనుకున్నాను. బ్రతికించావు పో... అయినా నేను చెప్పింది పూర్తిగా వినకుండానే అలా పడిపోతే ఎలా.. నాకు అద్దె ఎనిమిది వందలు ఇస్తే చాలు. కరంటు, నీరు ఎంతవాడుకున్నా ఫర్వాలేదు. రాత్రి వేళ ఎప్పుడొచ్చినా ఫర్వాలేదు. కాని తొమ్మిది దాటితే మా కుక్క బయట తిరుగుతుంది. దాని నుంచి తప్పించుకోవటం. దాని కళ్లు గప్పటం ఛార్లెస్ శోభరాజు, వీరప్పన్‌లకే సాధ్యం కాలేదు. మీకేమైనా సాధ్యమవుతుందేమో ట్రై చేయండి. ఇహ నేను ఆఖరిగా చెప్పేది ఒకటి. నాకు వారం వారం.' తరువాత ముసలాడు చెప్పింది మా ఇద్దరికి వినబడలేదు. కారణం మేమిద్దరం షాక్‌లో క్రిందపడిపోవడం మాత్రమే గుర్తుంది.

***

మర్నాడు ఆసుపత్రిలో ప్రక్క ప్రక్క మంచాల పైన.. ఒకరినొకరం చూసుకొన్నాం. ఇంతలో నర్సు వయ్యారంగా నడుచుకొంటూ వచ్చింది. అలా వచ్చిన ఆమెను సిస్టర్ అని పిలవబుద్ధికాక 'మిస్ మేము ఇక్కడి కెలా వచ్చామో చెప్పగలరా.' ఆమెను ఆమూలాగ్రం చూస్తూనే అడిగాం. 'ఓ ముసలాయన తెచ్చి ఇక్కడ పడేసాడు. వారింటి గుమ్మంలో మీరు స్పృహతప్పి పడిపోయారట. ముందు పోయారేమో అనుకున్నాడట. ముక్కు దగ్గర వేలు పెట్టి చూసాకా ఇంకా మీ నూకలను కాకులు తినలేదని గ్రహించి. ఇక్కడ పడేసాడట. రేపటికల్లా ఉంటే.. తనడిగిన దానికి సమాధానం చెప్పమన్నాడు. ఇంతకీ ఏం అడిగాడు. అని అడిగింది.'

మేం కొంచం సేపు.. మౌనంగా ఉండి పోయాం. తీరా చెప్పాకా, ఈవిడ కూడా మాలాగే పడిపోతే మా భావం గ్రహించిన దానిలా 'ఫర్వాలేదు చెప్పండి. మా డాక్టరు చచ్చిన శవాలను బంధువులకిస్తూ చెప్పే కథలకన్నా గొప్పగా మీరు చెప్పలేరు కాని చెప్పండి. నాకేమీ కాదు.' అని భరోసా ఇచ్చింది.

'ఏం లేదు మిస్. వారికో లంకంత కొంప ఉంది. అద్దె ఎనిమిది వందలు మాత్రమే. నీరు, కరంటు ఎంతైనా వాడుకోవచ్చునట. కాని వారానికోసారి కిలో కందిపప్పు మాత్రం ఇవ్వాలట' నా ఫ్రెండ్ చెబుతున్న మాట పూర్తి కాకుండానే దబ్ మన్న శబ్దం మాకు వినిపించింది.

ఆ శబ్దం నర్సు పడిపోయిన శబ్దమని విజ్ఞులైన మీకు మేము చెప్పనవసరం లేదు కదా.

*